సాక్షి
శ్రీకాకుళం
సోమవారం। 8। ఏప్రిల్। 2024



5600 లీటర్ల ఊట ధ్వంసం

మెళియాపుట్టి మండలంలో సారా ఊటలు ధ్వంసం చేశారు. సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. -IIలో



వాహనం ఢీకొని..

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. అక్కవరం సమీపంలో ప్రమాదం జరిగింది. -IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ	మంగళ
సాయంత్రం	ఉదయం
6.13	4.27

న్యూస్‌రీల్

మఖరజోల తోటల్లో ఎలుగు సంచారం

మందస: మండలంలోని మఖరజోల సమీపంలో గల జీడితోటల్లో ఎలుగుబంటి సంచరిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. శని, ఆదివారాల్లో మూలూరు చెరువు సమీపంలో సంచరించిన ఎలుగు అదే చెరువులో నీరు తాగిందని పేర్కొన్నారు. జీడితోటలకు వెళ్లే రైతులు భయపడుతున్నారని, అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. మరోవైపు అటవీ శాఖాధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఎలుగులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని, కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని చెబుతున్నారు.

ఆర్తుల సేవ



ఆర్తజన సేవ నిర్వహిస్తున్న సత్యసాయి యువజన విభాగం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి యువజన సేవా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్తజన సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా యూత్ కోఆర్డినేటర్ ఎ.శివకుమార్ తెలిపారు. సత్యసాయి సేవా సమితి న్యూకాలనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతంలో ఉన్న ఆరుగురు ఆర్తజనులకు క్షవరం చేసి, స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపచేసి, గోళ్లు కత్తిరించి, స్వామివారి ఫొటో, విభూది అల్పాహారం ఇచ్చారు. కార్యక్రమంలో శశికాంత్, స్వరూప్, వినోద్, చరణ్, ఆదినారాయణ, జయవర్ధన్ రెడ్డి, 15మంది యువత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన చదరంగం క్రీడాకారులతో నిర్వాహకులు

నరసన్నపేట: మండలం గుండవల్లిపేట రెసిడెన్షియల్ స్కూల్లో అండర్–17 జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఆసక్తిగా జరిగాయి. ఈ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు జిల్లా నుంచి ఎంపిక చేశారు. స్కూల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 36 మంది పాల్గొన్నారు. వీరిలో ఆరంగి మేఘన, బి.జీవన్, శేషాద్రి పట్నాయిక్, హర్షవర్ధన్‌లు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. వీరందరూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి సనపల భీమారావు తెలిపారు. ఈనెల 20, 21 వ తేదీల్లో కృష్ణాజిల్లా గుడివాడలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపాలని వారంతా ఆకాంక్షించారు.

'మంచి ముహూర్తమెప్పుడో..?'

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ తేదీ దగ్గర పడుతోంది. 18న నోటిఫికేషన్ రానుంది. అదే రోజు నుంచి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు వీలుంది. అయితే పేరుకు తగ్గట్టుగా ముహూర్తాల కోసం అభ్యర్థులు పండితులు, పురోహితులను కలిసి వాకబు చేస్తున్నారు. 18న నోటిఫికేషన్ రానుండగా నామినేషన్లు వేసేందుకు 25వ తేదీ వరకూ అవకాశం ఉంది. 8 రోజులు గడువు ఉండగా మధ్యలో 21 వ తేదీ ఆదివారం. ఆ రోజు నామినేషన్లు స్వీకరించరు. 7 రోజులు మిగిలి ఉన్నాయి. ఈ రోజుల్లో 18న దశమి, 19న ఏకాదశి, 20న ద్వాదశి, 22న చతుర్దశి, 23న పౌర్ణమి, 24న బహుల పాడ్యమి, 25న పాడ్యమి.. ఈ రోజుల్లోనే నామినేషన్లు వేయాలి. 22, 23, 25 తేదీలు నామినేషన్లకు అనుకూలమని సమాచారం. దీంతో అభ్యర్థులు తమకు అనుకూలమైన రోజు, ఘడియల కోసం పండితులను సంప్రదిస్తున్నారు. అయితే ఈ సారి ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్‌లో కూడా అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో ముహూర్తం ప్రకారం వేసి తర్వాత కార్యకర్తలతో కలసి మరో సెట్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



సామాన్యుడికి వైద్యం అందించే విషయంలో దేశ చరిత్రలోనే కనివినీ ఎరుగని ఓ గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టాం. ఇంటింటా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, ఏ పేదవాడు కూడా వైద్యం కోసం ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని, ఆరోగ్య భరోసా ఇస్తూ నేటి నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాం.

- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవం రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్న మాటలివి


తలుపు తట్టి.. నాడి పట్టి

సామాన్యుడి నోట..



ఇంతకు ముందు ఒంట్లో బాగోలేకపోతే ఆస్పత్రులకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు డాక్టర్లే ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు. ఇలా డాక్టర్లు ఇంటికి వచ్చి వైద్యం చేయడం ఎన్నడూ చూడలేదు. ఫ్యామిలీ డాక్టర్ అని చెబితే మొదట్లో మేము ఏదో అనుకున్నాం. కానీ రానురాను డాక్టర్లు, వైద్య సిబ్బంది ఊరిలోకే వచ్చి మందులు ఇవ్వడం చూస్తున్నాం. ఇది ఎంతో బాగుంది.

- తలగాన సన్యాసిరాజు, హరిదాసుపురం, నందిగాం మండలం





- జిల్లాలో విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం
- వేలాది ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించిన వైద్యులు
- అందుబాటులో 132 మంది వైద్యుల సేవలు
- ఇప్పటివరకు 26.02 లక్షల మందికి ఉచిత వైద్యసేవలు

అరసవల్లి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం ఉద్దేశం నెరవేరింది అనడానికి లబ్ధిదారుడి సంతృప్తి ఒక్కటే కొలమానం. అలా చూసుకుంటే ఫ్యామిలీ డాక్టర్ విధానం సూపర్ హిట్టయ్యింది. పల్లెపల్లెకూ వైద్యులను పంపిస్తూ.. నిస్సహాయులకు సాయం చేస్తూ వైఎస్ జగన్ సర్కారు ఈ విధానాన్ని సమర్థంగా అమలు చేసి చూపించింది. జిల్లాలో 2022 అక్టోబర్ 21 నుంచి ట్రయల్ రన్‌తో సహా అమలవుతున్న ఈ కొత్త వైద్య విధానంతో నేటి వరకు 26,02,127 మంది ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా ఉచిత వైద్యాన్ని పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన రోగుల ఇంటికే నేరుగా ప్రభుత్వ వైద్యుడే వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి, పరిస్థితులను ఫాలోఅప్ చేస్తుండేలా చర్యలకు అద్భుత స్పందన కనిపిస్తోంది. అలాగే వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నవారికి మొబైల్ మెడికల్ యూనిట్ (104) వాహనాల ద్వారా ఓపీ వైద్యాన్ని, ఉచితంగా పరీక్షలు, మందులు ఇచ్చే ప్రక్రియ కూడా ఈ విధానానికి తోడయ్యింది.

ఇలా అమలవుతోంది

- జిల్లాలో 30 మండలాల్లో ఉన్న 591 విలేజి హెల్త్ క్లినిక్స్ పరిధిలో ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలవుతోంది.
- మొత్తం 55 ఎంఎంయూ 104 వాహనాలను ఇందులో వినియోగిస్తున్నారు.
- ప్రతి నెలలో రెండు రోజులు గ్రామాల్లో ఈ విధానం అమలయ్యేలా షెడ్యూల్‌ను ప్రతి నెలా ఉన్నతాధికారులు సిద్ధం చేస్తారు.
- జిల్లాలో 132 మంది మెడికల్ ఆఫీసర్లు పూర్తి స్థాయిలో విధుల్లో ఉన్నారు. అలాగే 104 వాహనం వద్ద ఓపీ వద్ద 14 రకాల పరీక్షలతో పాటు 67 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి.



జి.సిగడాం: సీతంపేటలో రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అడుగు తీసి అడుగు వేయలేని ఓ అవ్వకు ఇంటి వద్దే వైద్యం చేసి మందులిచ్చారు. ఆమె నవ్వుకు మించిన ఆశీర్వాదం ఏముంటుంది..? ఓపీ లైన్లకు భయపడి ఎన్నడూ ఆస్పత్రి మెట్లు ఎక్కని ఓ తాతకు ఉన్న చోటకే వచ్చి వైద్య పరీక్షలు చేశారు. ఆయన ఆనందానికి మించిన సంతృప్తి ఏముంటుంది? బీపీ, సుగర్ వేధిస్తున్నా నెలనెలా మందులు కొనే స్థోమత లేని ఓ నిరుపేదకు ఇప్పుడు ప్రతి నెలా ఉచితంగా మందులు అందుతున్నాయి. ఆ సామాన్యుడి నోటి వెంట వచ్చే కృతజ్ఞతకు మించిన జయజయధ్వానం ఏముంటుంది? వైఎస్ జగన్ సర్కారు పురుడు పోసిన ఫ్యామిలీ డాక్టర్ అనే విధానం తీసుకువచ్చిన మార్పు ఇది. ఆస్పత్రుల్లోని వైద్యులను ఊళ్లకు పంపించి, ఓ అంబులెన్స్‌ను తోడుగా ఇచ్చి, 67 రకాల మందులు అందుబాటులో ఉంచి, 14 రకాల వైద్యపరీక్షలు చేయిస్తూ ప్రభుత్వం పల్లెకు అభయమిస్తోంది. – అరసవల్లి,గార, టెక్కలి, ఎచ్చెర్ల క్యాంపస్, జి.సిగడాం, నరసన్నపేట, కాశీబుగ్గ, ఆమదాలవలస, ఆమదాలవలస రూరల్, మెళియాపుట్టి, కొత్తూరు

సేవలు అందాయిలా..

సేవ	సంఖ్య
ఉచిత పరీక్షలు, మందులు తీసుకున్న వారి సంఖ్య	26,02,127
సాధారణ ఓపీ, మందుల పంపిణీ	13,01,547
గర్భిణులకు యాంటీనేటల్ కేర్ పరీక్షలు	43,894
బాలింతలకు ఆరోగ్య పరీక్షలు (పిఎన్‌సి)	19,183
రక్తపోటు (బీపీ)	3,26,217
మధుమేహం (షుగర్)	1,27,684
నోటి క్యాన్సర్	626
ఈసీజీ	1,89,131
టీబీ (క్షయ)	1437
హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు (హెచ్‌బీ)	1,70,383
ర్యాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్)	1,42,684



చిత్రంలో మహిళ పేరు గొల్లపల్లి లక్ష్మి. ఆమదాలవలస మండలం కొరపాం గ్రామం. ఈమెకు సుగర్ వ్యాధి ఉంది. దీనికి తోడు కాలికి గాయమై తగ్గడం లేదు. నిత్యం చీము, రక్తం అధికంగా వచ్చేది. రోజూ ఆస్పత్రికి వెళ్ల లే రు. ఈమెకు ఇప్పుడు నిత్యం ఇంటి వద్దే చికిత్స అందిస్తూ బతుకుపై ఆశ కల్పించారు.

మేధావి మాట..



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలో అమలు చేస్తుండడం అద్భుతమే. ఈ విధానం విదేశాల్లో కొన్ని చోట్ల ఉంది. రోగి ఇంటికే నేరుగా ప్రభుత్వ వైద్యుడు వెళ్లి మందులు, వైద్య పరీక్షలపై ఆరా తీసి తదుపరి మెరుగైన వైద్యం కోసం సలహాలనిచ్చే ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ముఖ్యంగా రోగికి మానసిక ధైర్యం ఇస్తున్నారు. మరీ ముఖ్యంగా ఆ రోగి ఫ్యామిలీ హ్యాపీగా ఉంటున్నారు. ప్రతి ఊరికి ఫ్యామిలీ డాక్టర్ అంటూ పనిచేయడం అద్భుతం. ఏ ఇంట్లో అనారోగ్య సమస్యలుంటే వెంటనే ఆ పీహెచ్‌సీ డాక్టర్ (ఫ్యామిలీ డాక్టర్)ను సంప్రదించడం అనేది అలవాటవుతుంది. దీంతో చాలా కీలకమైన సమయంలోనే మంచి వైద్యాన్ని అందించే అవకాశాలుంటాయి. వైద్యుల్లో కూడా సేవాభావం ఇంకా మెరుగవ్వాలి. మెడికోలను కూడా ఇదో శిక్షణగా ఈ కాన్సెప్ట్‌లో ప్రాక్టికల్‌గా చూపిస్తే.. భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. – డాక్టర్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, సామాజిక విద్యావేత్త.



హిరమండలంలో ఇంటికి వచ్చి వైద్యం అందిస్తున్న డాక్టర్లు

ప్రాణం నిలబెట్టారు



నాకు పక్షవాతం సోకి బయటకు రాలేకపోతున్నాను. డాక్టర్ మా ఇంటికి వచ్చి వైద్యం అందిస్తున్నారు. నాకు అవసరమైనప్పుడు ఏఎన్‌ఎం ద్వారా మందులు అందుతున్నాయి. నాలాంటి వారి కోసమే సీఎం జగనన్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ డాక్టర్ ద్వారా నా ప్రాణం ఇంత వరకు నిలబడింది.

– ఎ.చిన్నమ్మి, కొత్తూరు గ్రామం, కొత్తూరు మండలం

పూర్తిస్థాయిలో పరీక్షించారు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నాకు గుండెకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆరోగ్య శ్రీ కింద శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ పూర్తిస్థాయి ఆరోగ్య పరీక్షలు చేశారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు గుర్తించి చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కోలుకున్నాను.

– సీపాన లక్ష్మణరావు, ఫరీదుపేట, ఎచ్చెర్ల మండలం

కుటుంబ సభ్యుల్లా..



నాకు మూడు నెలల నుంచి అనారోగ్యం చేసింది. సచివాలయం వద్ద ఆస్పత్రికి వ్యానులో డాక్టర్ వస్తున్నారని తెలిసి పరీక్షలు చేయించుకున్నాను. బీపీ, సుగర్ లేవు అన్నారు. రక్త పరీక్ష చేశారు. రక్తం తక్కువ ఉందని మందులు, టానిక్ ఇచ్చారు. అలాగే ఒళ్లు నొప్పులకు మాత్రలు ఇచ్చారు. బాగా తగ్గాయి. ప్రతీ నెలా వచ్చి తనిఖీలు చేయించుకుంటున్నాను. ఇప్పుడు ఆరోగ్యం బాగుంది. ఇంటిలో కుటుంబ సభ్యులు పట్టించుకోక పోయినా నెల వారీ సచివాలయం వద్దకు సిబ్బంది వచ్చి తనిఖీలు చేస్తున్నారు.

– సూరాన లక్ష్మి, సత్యవరం, నరసన్నపేట

డాక్టర్ వారానికి రెండుసార్లు వస్తున్నారు



నాకు కిడ్నీ సమస్య వచ్చి చాలా ఏళ్లవుతోంది. మూడేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. నాకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. డయాలసిస్ సేవలు సక్రమంగా అందినంతవరకు మాత్రమే నేను బతుకుతాను. నాకు ఇద్దరు పిల్లలు. అందులో ఓ కుమారుడు నాతో ఉంటాడు. నా భర్త బీపీ ఎక్కువై చనిపోయారు. ప్రభుత్వం నాకు రూ.10 వేలు పింఛన్ ఇస్తోంది. ప్రస్తుతం పలాస వచ్చి కిడ్నీ డయాలసిస్ సేవలు పొందుతున్నాము. నెఫ్రాలజీ వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు పొందుతున్నాను. ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చాక వారానికి రెండు మూడు సార్లు డాక్టరే మా ఇంటి వద్దకు వస్తున్నారు. నా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ అవసరమైన మందులు నెలరోజులకు తగినట్లు ఇస్తున్నారు. ఎలాంటి సమస్య వచ్చినా మాకు ప్రతిరోజు సిబ్బంది అందుబాటులో ఉండి చూసుకుంటున్నారు.

– తామాడ లక్ష్మిదేవి, బైపల్లి, వజ్రపుకొత్తూరు

మంచి మందులిచ్చారు



మా గ్రామంలో సంక్రాంతి ముందు పంచాయతీ ఆఫీసు వద్దకు డాక్టర్లంతా వచ్చి పెద్ద కార్యక్రమం చేశారు. నేను మా వలంటీరు రాజు చెప్పినట్టు అక్కడున్న డాక్టరు బాబుని కలిశాను. నాకున్న నడుపు నొప్పి, కాలు నొప్పి కోసం చెప్పాను. ఏమీ ఫరవాలేదమ్మా అని చెప్పి మంచి మందులిచ్చారు. కంటి డాక్టరు బాబు కూడా అక్కడే ఉంటే అక్కడికి వెళ్తే అన్ని రకాలుగా తనిఖీలు చేశారు. కళ్లద్దాలను మా ఊరులో పనిచేసే అమ్మ తెచ్చి కొద్ది రోజుల తర్వాత తెచ్చి ఇచ్చింది. మందులను మాత్రం రోజూ తప్పకుండా వేయాలని డాక్టరు చెప్పారు. అలాగే వేశాను. నడుము నొప్పి బాగా తగ్గింది. ఇంటికే పెద్ద డాక్టరు బాబు వస్తున్నారు. అన్నీ అడిగి మందులిస్తున్నారు. అన్ని గ్రామాలకు ఇలానే వెళ్తున్నారు అని తెలిసింది. సీఎం జగన్‌బాబు చల్లగుండాలి.

– కింతలి రాజేశ్వరమ్మ, తోనంగి, గార మండలం

ఆస్పత్రులకు వెళ్లకుండా..



టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకు చెందిన సనపల చిన్నమ్మి అనే వృద్ధురాలు కాలనీలో ఒంటరిగా నివసిస్తోంది. తరచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఒక డాక్టర్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది తరచూ ఆమె ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ మందులను అందజేస్తున్నారు. గతంలో చిన్నపాటి అనారోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేదని.. ఇప్పుడు మా ఇంటికే డాక్టర్లు వచ్చి మందులు ఇస్తున్నారని ఆనందంగా చెబుతున్నారు.

ప్రభుత్వ మందులే కాపాడుతున్నాయి



నేను చాలా ఏళ్లుగా బీపీ, సుగర్‌తో బాధ పడుతున్నాను. ఎంతోమంది డాక్టర్లను కలిశాను. జగనన్న వచ్చిన తర్వాత ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో మా ఊరిలో శిబిరం పెట్టినప్పుడు వెళ్లి వైద్య పరీక్షలు చేయించాను. ఈ వైద్యులు మందులు ఇచ్చాక ఆరోగ్య మెరుగుపడింది. ప్రతి నెలా ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ వైద్య సిబ్బంది వచ్చి తనిఖీలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇచ్చి వెళుతున్నారు. ఈ మందులే నన్ను కాపాడుతున్నాయి. మళ్లీ వైఎస్ జగన్ గెలిస్తే మాలాంటి వాళ్లం బాగుంటాం.

– బెజ్జిపల్లి రమణమ్మ, జోదూరు గ్రామం, మెళియాపుట్టి మండలం

ఇంటికొచ్చి మందులిచ్చారు



నాకు ఎప్పటి నుంచో బీపీ, సుగర్ ఉన్నాయి. ఆస్పత్రికి ఎప్పుడూ వెళ్లలేదు. ఇప్పుడు ప్రతి నెలకు రెండు సార్లు మా ఇంటికే డాక్టర్ గారు వచ్చి మందులిస్తున్నారు. పరీక్షలు చేయించారు. ఏం చేస్తే జబ్బు పెరగకుండా ఉంటుందో చెప్పారు. ఏ అవసరం వచ్చినా ఫోన్ చేసి చెప్పాలని ఆయన ఫోన్‌నంబర్‌ను కూడా ఇచ్చారు. ఇలా ఇంటికి డాక్టర్‌ని పంపించి మాలాంటి వారిపై దయ చూపిస్తున్న ప్రభుత్వం ఇదే. నేను పుట్టినప్పటి నుంచి ఇలాంటి పద్ధతి ఎప్పుడూ చూడలేదు.

– కింజరాపు మల్లేసు, ఎస్.ఎస్.వలస (సింగుపురం)

ఉద్దానంలో ఈదురు గాలులు



ఉద్దానంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారి వాతావరణం చల్లబడి అరగంట పాటు ఈదురు గాలులు దుమారం రేపాయి. ఈ ఏడాది అంతంత మాత్రంగా మామిడి దిగుబడి రావడంతో నిరాశలో ఉన్న రైతులకు ఆ గాలులు ఆందోళన కలిగించాయి. అయితే ఎటువంటి నష్టం కలగకపోవడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. - ఇచ్ఛాపురం రూరల్

రూ.70 వేలు స్వాధీనం

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఎఫ్‌ఎస్‌టీ బృందం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేని రూ.70వేలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కోటబొమ్మాళి మండలంలోని గ్రానైట్ కంపెనీకి చెందిన రోహిత్ గౌడాడకి చెందిన ఈ డబ్బులకు సరైన ఆధారాలు లేకపోవడంతో పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

నగరంలో వాహనాల తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సరస్వతీ మహల్ సమీపంలో రెండో పట్టణ రెండో పట్టణ ఎస్ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ జరిగాయి. ఎన్నికలు నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల కార్లు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలను ఆపి అందులో బ్యాగులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరికృష్ణ మాట్లాడుతూ ఏవైనా మత్తు పదార్థాలు, నగదు అక్రమంగా తరలిస్తే కేసులు పెడతామని చెప్పారు.

2024 సమరం సన్నద్ధం

12 కేజీల వెండి ఆభరణాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలను పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: మండలం సత్యవరం కూడలి వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఒక కారులో రూ. 4.40 లక్షల విలువైన 12.306 కేజీల వెండి ఆభరణాలను అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. డీటీ గాయత్రి ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా వీటిని గుర్తించారు. శ్రీకాకుళం నుంచి నరసన్నపేటకు కారులో ఎరుమోజు సోమేశ్వరరావు ఈ వెండి ఆభరణాలు తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. వీటిని ఆర్‌ఓ సూచనల మేరకు ట్రెజరీలో భద్రపరిచినట్లు డీటీ గాయత్రి తెలిపారు.

తనిఖీల్లో రూ. 78 వేలు స్వాధీనం

నరసన్నపేట: జడూరు వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ. 78 వేలు స్వాధీనం చేసుకున్నట్లు నరసన్నపేట డీటీ శరత్ తెలిపారు. చింతాడ సుగుణ వద్ద ఈ డబ్బు గుర్తించినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.



తనిఖీల్లో పట్టుబడిన నగదును పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

మందస: మండలంలోని బాలిగాం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇచ్ఛాపురం వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ బాలిగాం అండర్‌పాసేజ్ వద్ద ఆగి ఉండగా.. వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న రాజేశ్, రమేష్ అనే యువకులు ఢీకొన్నారు. తీవ్ర గాయాలపాలైన ఇద్దరినీ హైవే అంబులెన్స్‌లో పలాసలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజలను చైతన్యవంతం చేద్దాం'



పోటీల్లో గెలుపొందినవారికి షీల్డ్ అందజేస్తున్న జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

శ్రీకాకుళం: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం రచయితలు ముందుకు రావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయ భావనలు, మూఢ నమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయ సమాజం కోసం, ప్రజా సంక్షేమం కోసం కవులు, రచయితలు తమ రచనలతో ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ ఉగాది సందర్భంగా జిల్లాస్థాయి కవితల పోటీల్లో కుప్పిలి వెంకట రాజారావుకు ప్రథమ స్థానం, పప్పల వైకుంఠరావుకు ద్వితీయ స్థానం, నవ్యశ్రీకు తృతీయ స్థానం, బోగిల ఉమామహేశ్వరరావుకు కన్సొలేషన్ బహుమతులు దక్కాయని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో కోవెలకొండ సంతోష్‌కుమార్ స్వామికి ప్రథమ, చాడ శ్రీనివాసరావుకు ద్వితీయ స్థానం, ఎస్ వాహినికు తృతీయ స్థానం గెలుపొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూజారి గోవిందరావు, కుమార్, సంజీవరావు, సురేష్ బాబు, మన్మధరావు, వాసుదేవరావు, సమత తదితరులు పాల్గొన్నారు.

నీరజకు ఉగాది విశిష్ట పురస్కారం



ఉగాది పురస్కారాలతో అభినయ నృత్యనికేతన్ చిన్నారులు, నీరజా సుబ్రహ్మణ్యం

శ్రీకాకుళం కల్చరల్: విశాఖ పబ్లిక్ లైబ్రరీలో ధ్యాన అన్నమయ్య ట్రస్ట్, స్కై ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉగాది కళా ఉత్సవంలో నగరానికి చెందిన అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు డాక్టర్ నీరజా సుబ్రహ్మణ్యంకు ఉగాది విశిష్ట పురస్కారంతో ఆదివారం సత్కరించారు. ఈమె కూచిపూడి, భరతనాట్యంలలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారాన్ని అందించారు. నీరజ శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ చిన్నారులను కూడా ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 91వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో కవులు సామాజిక పరమైన కవితలు చదివారు. కవి సమ్మేళనంలో కవులు ఐఎన్‌డీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఇద్దిపాపయ్య, తోట గోపాలరావు, నిక్కు అప్పన్న, పూడి జనార్దనరావు, భోగిల ఉమామహేశ్వరరావు, బి.మోహన్‌గాంధీ, కె.బాలాజీ, రవికిరణ్, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనం మధ్యన..

విజయ తిలకాలు, గెలవాలని హారతులు, ఓటు వేయాలని అభ్యర్థనలు, సామాన్యులతో ముచ్చట్లు.. కలగలిపి ఎన్నికల ప్రచారాలు ఆసక్తిగా సాగుతున్నాయి. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ నాయకులు వినూత్న రీతుల్లో ప్రచారాలు చేస్తున్నారు.



పొందూరు: ఎన్నికల ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



రణస్థలంలో ఎమ్మెల్యే కిరణ్‌కు హారతులిచ్చి, విజయతిలకం దిద్దుతున్న మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: మునిభద్రలో ప్రచార రథంపై ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



సారవకోట: గుమ్మపాడు జంక్షన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కొత్తూరు: గొట్టిపల్లి గిరిజన పంచాయతీ చీపురపల్లిలో గిరిజనులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి




సంతబొమ్మాళి: లక్ష్మీవలసలో ఉండమ్మా వంట చేస్తానంటున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పక్కన జెడ్పీటీసీ వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి



పలాస-కాశీబుగ్గలో ఎన్నికల ప్రచారం కోసం వస్తున్న మంత్రి అప్పలరాజుకు దిష్టి తీసేందుకు వచ్చిన ఆడపడుచులు

5600 లీటర్ల ఊటలు ధ్వంసం



ఎగువబగడ గ్రామంలో స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసు బలగాలు

మెళియాపుట్టి: మండలంలోని మర, బాలేరు, భరణికోట, ఎగువబగడ గ్రామాల్లో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సారా తయారీ స్థావరాలపై ఆదివారం సంయుక్త దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ దాడుల్లో 5600 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా.. 120 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారీని నిలువరించేందుకు కృషి చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియపరచి, సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని సూచనలు చేశారు.

ఈ దాడుల్లో ఈఎస్ తిరుపతినాయుడు, సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడులతో పాటుగా, ఎఆర్ పోలీస్ బృందం, శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, టెక్కలి, కొత్తూరు, పాతపట్నం ఎస్ఈబీ పోలీసులతో పాటు ఇంటెలిజెన్స్, డీటీఎఫ్ సిబ్బంది, మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్, పాతపట్నం ఎస్సై మహ్మద్ యాసిన్ పలువురు సిబ్బంది ఉన్నారు.

కారు, లారీ ఢీ చిన్నారి మృతి

● నలుగురికి గాయాలు



కారు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్

మేదరమెట్ల: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అభం శుభం తెలియని చిన్నారి కానరానిలోకానికి వెళ్లింది. ఈ ఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా రైల్వేకోడూరుకు చెందిన కుటుంబం శ్రీకాకుళంలో గత మూడేళ్లుగా వ్యాపారం చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఉగాది పండగ సందర్భంగా స్వస్థలం రైల్వేకోడూరు బయలుదేరాలని నిశ్చయించుకున్నారు. అనంతరం వారు కారులో బయలుదేరారు. సరిగా గుడిపాడు జాతీయ రహదారి వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. తేరుకునే లోగా కారు మొదటగా డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ధార్విక (06) అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా మరో నలుగురికి గాయాలయ్యాయి.

గాయపడిన వారిలో శివసుందర్, ఈశ్వరయ్య, సంగతిక, నాగేశ్వరమ్మ, శేషవిన్ ఉన్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్సులో ఒంగోలు సంఘమిత్ర ఆస్పత్రికి తరలించారు. కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన గురయ్య

టెక్కలి రూరల్: స్థానిక అక్కవరం గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని ముంజేటి గురయ్య(69) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పోలాకి మండలం రెహమాన్ పురం పంచాయతీ బెజ్జిపాడు గ్రామానికి చెందిన గురయ్య ఆదివారం టెక్కలి మండలం శ్యామసుందరపురం గ్రామంలో ఉన్న తన కుమార్తె సుహాసినికి ఉగాది పిలుపు చేసి తిరిగి వెళ్తుండగా.. అక్కవరం వద్ద ఉన్న ప్రైవేట్ డిగ్రీకళాశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే చనిపోయారు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపులో భాగస్వాములమవుదాం

కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అంధవరపు సూరిబాబు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పెట్టిన హామీల్లో 95 శాతం హామీలు నెరవేర్చి, అర్హులైన కళింగ వైశ్యులందరికీ అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జిల్లా కళింగ కోమటి సామాజికవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సూరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపులో కళింగ వైశ్యులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను బలపరిచి స్థానికంగా ఉండే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను మాట్లాడుతూ తిరుపతిలో కళింగ వైశ్యుల సత్రం ఏర్పాటుకు స్థలం కేటాయించి మన ఆత్మగౌరవాన్ని జగన్‌మోహనరెడ్డి పెంచారన్నారు. అదే విధంగా కళింగ వైశ్యులను రాష్ట్రమంతా బీసీలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో కళింగ వైశ్య సామాజిక సంఘం నాయకులు కోరాడ చంద్రభూషణగుప్త, కోటేశ్వరరావు, తంగుడు జోగారావు, ఊన్న నాగరాజు, వైశ్యరాజు మోహన్, గుడ్ల దామోదరరావు, అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్, అంధవరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే పోటీ పరీక్షలు



జిల్లాస్థాయి మేధా సమ్మాన్ పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఒడియా టీచర్స్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: విద్యార్థుల్లో గల ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి, మండలాధ్యక్షుడు అశోక్‌జాదవ్ అన్నారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధి ఒడియా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి మేథాసమ్మాన్ పోటీపరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ ఒడియా ప్రాథమిక పాఠశాలల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షలకు పరిశీలకులుగా మిన్ను చంద్రమండల్, సిద్ధార్థ్ లిమ్మాయ్ వ్యవహరించారు. విజేతలగా నిలిచిన శుభమ్‌సాహు, మానసి మహాపాత్రో, ప్రణయసాహు లకు బాపూజీ ఒడియా పాఠఘర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడో, ఒడియా ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు డిల్లేశ్వర్ శెట్టి, ప్రశాంత్‌లిమ్మాయ్, భాస్కర్‌పాఢి, మురళీధర్‌గౌడో, శ్రీనివాసపూండి, చంద్రశేఖర్, కవిరాజ్‌రెడ్డి, కేశవరావు, భగీరథి, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తిగా క్రికెట్ పోటీలు



విజేతగా నిలిచిన సర్వేయర్ కాజు జట్టు

వజ్రపుకొత్తూరు రూరల్: ఏప్రిల్ 10న నేషనల్ సర్వే డే సందర్భంగా జిల్లా సర్వేయర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీలు జరిగాయి. పోటీల్లో డివిజన్ సర్వేయర్ 'కాజు' జట్టు విజేతగా నిలిచింది. అనంతరం ఉద్యోగులు రక్తదానం చేశారు. కాగా విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడితో ఉండే సర్వేయర్‌లకు మానసిక ఉత్తేజాన్ని కల్పించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో మంత్రి ధర్మాన ప్రసాదరావు



మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన గురుదాసుపురం తెలుగుదేశం కార్యకర్తలు



టీడీపీ కార్యకర్తలకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీద వర్గాలకు అనుకూలంగా ఉండేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన అందిస్తోందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో టౌన్‌హాల్‌లో యాదవులతో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన యాదవులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ధర్మాన మాట్లాడుతూ.. మన జిల్లాలో మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు మొదలుపెట్టామని తెలిపారు. తిరుపతి దేవస్థానంలో అనాదిగా వస్తున్న సన్నిధి గొల్లలు స్వామిని మొదట దర్శనం చేసుకునే విధంగా సంబంధిత నియమాన్ని పునరుద్ధరించామని గుర్తు చేశారు. యాదవులకు రాజ్యసభ టికెట్లు- 5 ఎమ్మెల్సీ టిక్కెట్లు ఇచ్చామని ఇప్పుడు 2 ఎంపీ టికెట్లు, 4 ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించామన్నారు. మొదటిసారి అరసవల్లి ట్రస్ట్‌లో యాదవులకు సముచిత స్థానం కల్పించామన్నారు. చంద్రబాబుకు యాదవుల ఓట్లు కావాలే తప్ప పదవులు, సంక్షేమం అందించలేదన్నారు. ఏనాడైనా టీడీపీలో ఇన్ని పదవులు ఇచ్చారా అని ప్రశ్నించారు. పెదపాడులో తాగునీటి సమస్యలు తీరుస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, రాపాక చిన్నారావు, పొలిన శ్రీనివాసరావు, గద్దిబోయిన కృష్ణయాదవ్, బాగు దశరథ, పిట్ట దామోదరరావు, బూర పాపారావు, గురునాధయాదవ్, నర్తు నరేంద్రయాదవ్, లాయర్ బాలకృష్ణతో పాటు అధిక సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక

పలాస: పలాస మండలం గురుదాసుపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 25 మంది నేతలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఇరవై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షునిగా పనిచేసిన పోతనపల్లి మాధవరావు, సొర్ర పెద్ద రామారావు, మాజీ సర్పంచ్ చిట్టయ్య తదితరులు మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. డాక్టరు సీదిరి అప్పలరాజును గెలిపించడానికి తామంతా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి అభ్యర్థి సొర్ర కామేశ్వరరావు, సొర్ర రామారావు, బొడ్డు దాసు, షణ్ముఖాచారి, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ జినగ లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీలో గల సరగడపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు తూతి రాము, దుంగ తవుడుతో పాటు పది కుటుంబాలు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, పైడిభీమవరం ఎంపీటీసీలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావులు ఉన్నారు.

నేడు ఉద్దానంలో మంత్రి సీదిరి ప్రచారం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం ఉద్దాన ప్రాంతంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పలాస మండలం మామిడిపల్లి గ్రామంలో ప్రచారం ప్రారంభమై బొడ్డపాడు కాలనీ, బొడ్డపాడు గ్రామం, మాకన్నపల్లి, గొల్లమాకన్నపల్లి వరకు ప్రచారం చేసి అదే గ్రామంలో మధ్యాహ్న భోజనం పూర్తి చేసుకుని చిన్ననీలావతి, పెద్దనీలావతి, కొబ్బరిచెట్లూరు, రంగోయి గ్రామాల్లో పర్యటిస్తారు.